కథ

# పెళ్ళిచూపులు

పోస్ట్! అన్న కేకతో భుక్తాయాసం తీర్చుకొంటున్న రంగారావు విసుగ్గా వచ్చి పోస్ట్‌మేన్ ఇచ్చిన ఉత్తరాన్ని అందుకొన్నాడు.

పరిచయం లేని దస్తూరి, ఎక్కడ నుండి వచ్చిందబ్బా? అనుకొంటూ ఉత్తరాన్ని చింపి చదవసాగాడు.

''రంగారావుగారికి...

ప్రకాశం నమస్కరించి వ్రాయునది.. ఉభయకుశలోపరి.. మీకు మా గురించి, మా సంబంధం గురించి ఈపాటికి పెళ్ళిళ్ళ పేరయ్య పేరిశాస్త్రి గారు అన్ని విషయాలు చెప్పే ఉంటారు. కావున... మీ దంపతులుభయులు అబ్బాయి సుందరంతో సహా వచ్చే ఆదివారం మా అమ్మాయి పర్ణికను చూసుకొనేందుకు రావల్సిందిగా ప్రార్థిస్తున్నాను.

తమరాక విషయం ముందుగా తెలియజేసిన తగిన ఏర్పాట్లు చేసుకొనగలవాడను''

ఇట్లు
తమ భవదీయుడు
ప్రకాశం, అనకాపల్లి''

పర్ణిక అనకాపల్లి స్టేట్‌బ్యాంక్‌లో పనిజేస్తోంది. ఈమధ్యనే ఆమె తండ్రి చనిపోయాడు. ఒక్కర్తే ఆడపిల్ల. ప్రస్తుతం అనకాపల్లిలో వాళ్ళ బాబయ్యగారి ఇంట్లోనే ఉంటోంది.

అప్పుడు గుర్తొచ్చింది రంగారావుకి పది రోజుల క్రితం పేరిశాస్త్రిగారు ఈ అనకాపల్లి సంబంధం గురించి చెప్పిన సంగతి.

ఉత్తర సారాంశం, పెళ్ళిచూపుల విషయం భార్య శారదతో చెప్పాడు రంగారావు.

''ముందర మీ పుత్రరత్నాన్ని రానివ్వండి. వాడేమంటాడో.. ఈమధ్యన వాడు పెళ్ళి, పెళ్ళి చూపులు అంటే తెగ చికాకు పడిపోతున్నాడు'' మూతి తిప్పుకొంటూ చెప్పింది శారద.

నిజమే. వాడికి ఈమధ్యనే ముప్పై ఒకటి నిండి ముప్పై రెండు వచ్చాయి. ఇంతవరకు పెళ్ళి కుదరలేదు. సుందరం అందగాడు కాదనుకొంటే ఖచ్చితంగా పప్పులో కాలేసినట్లే. ఎందుకంటే సుందరం నిజంగా పేరుకు తగ్గట్లుగానే చాలా అందంగా ఉంటాడు. ఉంగరాల జుట్టు, తెల్లని శరీరచ్ఛాయ, సుమారు ఆరడుగుల పొడుగు, ఆ పొడుక్కి తగ్గట్టుగా శరీరం. ఒక విధంగా చెప్పాలంటే నవమన్మథుడులా ఉంటాడు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో మంచి హోదాలో ఉన్నాడు. జీతం ఐదంకెల్లో ఉంటుంది.

అయితే ప్రతి మనిషికి కొన్ని వీక్‌నెస్‌లు ఉన్నట్లే సుందరానికి, రంగారావుకి, శారదకి కూడా ఉన్నాయి.



సోమవరపుల నాగేంద్రప్రసాద్

ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన రచన

సుందరం అమ్మాయి అందంగా ఉండాలి అంటాడు. అయితే అందానికి నిర్వచనం మాత్రం అడగొద్దంటాడు. అందరికి పిల్ల నచ్చితే అతనికి నచ్చదు. కారణం ఇది అని ఖచ్చితంగా చెప్పలేడు.

ఇంతవరకు సుమారు ఒక డజను మంది అమ్మాయిలను చూసాడు. ఆ డజను మందిలోను రంగు తక్కువవాళ్ళు ఒక నలుగురైతే, ఎత్తు తక్కువగా ఉన్నవాళ్ళు ఒక ముగ్గురు. మిగతావారిలో కొందరిది నొక్కుల జుత్తైతే, కొందరిది పొట్టి జడ. ఇలా చూసిన ప్రతీ అమ్మాయికి ఏదో ఒక వంక పెడుతూ ఆ సంబంధాన్ని వదులుకొనేవాడు సుందరం.

ఇంక రంగారావు విషయానికొస్తే, అతనికి జాతకాల పిచ్చి. జాతకాలు కుదరలేదని ఒక అర డజను, అబ్బాయికి అమ్మాయికి వయసులో తేడా చాలా తక్కువని రెండు, ఎక్కువని మరో రెండు, మిగతా రెండు ఇద్దరూ జేష్టులే. రెండు జేష్టులు పనికిరావంటూ మొత్తానికి ఏ సంబంధానికి వప్పుకొనేవాడు కాదు.

ఏవైనా సంబంధాలు భర్తకి, కొడుక్కి నచ్చి ముందుకు వెళ్దామనుకొన్నా శారదకి నచ్చక కొన్ని వదలుకొన్నారు. శారదకు చాదస్తం పాళ్ళు కొంచెం ఎక్కువే. దానికి తోడు మడి, ఆచారం అంటూ లేనిపోని ఆంక్షలు పెట్టి ఆడపిల్లల వాళ్ళని అదరగొట్టేసింది.

ఏమైనా అంటే మీరే ఈ సంబంధాన్ని జాతకాల వంకతో కాదన్నారని కొడుకు, భార్య అంటే, నువ్వే ఆ అమ్మాయి అందంగాలేదని కాదన్నావని రంగారావుగారు వాదించుకొనేవారు.

''చూడు నాయనా అందం అన్నది శాశ్వతం కాదు. నన్ను చూడు మీ అమ్మ అందాన్ని చూసే పెళ్ళిచేసుకొన్నానా?'' శారద వంక చూస్తూ అన్నాడు రంగారావు.

దాంతో ఆమెకు పౌరుషం వచ్చి.. ''ఆ.. ఇంతోటి నవమన్మధుడు నాకు దొరక్క కాదు మీ నాన్నను చేసుకొన్నది. ఏదో వరసకి బావ అవుతాడు కదా అని, మా నాయనమ్మ నచ్చ చెప్పబట్టే ఈయన్ని చేసుకొన్నాను'' అంటూ శారద అంతవరకు రంగారావుకి తెలియని చేదునిజాన్ని బైట పెట్టేంది. దాంతో రంగారావు తేలుకుట్టిన దొంగలా నోరుమూసుకొన్నాడు.

ఏది ఏమైనా సుందరం పెళ్ళి కుదరకపోవడానికి ఏవో సాకులు దొరుకుతూనే ఉన్నాయి.

''ఇలా చూసిన ప్రతీ సంబంధాన్ని ఏదో ఒక వంకతో కాదంటే ఇంక మీవాడికి సంబంధాలు తేవడం నావల్ల కాదు. ఇప్పటికి నేను ఎంతోమందికి వివాహాలు కుదిర్చాను. కానీ ఇలా మీవాడికి చెప్పినన్ని సంబంధాలు ఎవరికీ చెప్పలేదు. ఇలా కాదనుకొంటూ పోతే మీ అబ్బాయికి, ముదిరిన బెండకాయకి పెద్ద తేడా ఉండదు. ఆఖరికి ఏదో దొరికిన సంబంధాన్ని చేసుకోవాల్సిన పరిస్థితి రావచ్చును. అందుచేత నా మాట విని కనీసం ఈ సంబంధాన్నైనా ఖాయం చేసుకోండి'' అంటూ తనకి తోచిన సలహాను ఇచ్చారు పేరిశాస్త్రిగారు.

శాస్త్రిగారి మాటలకు రంగారావుకి తల కొట్టేసినంత పనయింది. వెధవది మగపెళ్ళి వాళ్ళం మాకే ఇన్ని నీతులు చెబ్తారా అని. అయినా ఆయన్ననుకొని ఏం ప్రయోజనం. ఆయన చెప్పిన దాంట్లోనూ నిజం లేకపోలేదు. పాపం ఆయన ఇప్పటికే తన కొడుకు నిమిత్తం చాలా సంబంధాలనే చెప్పారు. అదేం విచిత్రమో ఒక్కటీ కుదిరి ఛావ లేదు. ఇప్పటికే తన బంధువులు, తెల్సున్నవారు, అలాగే అబ్బాయి స్నేహితులు చాలా ఆటపట్టేస్తున్నారు. వయసు ముదిరిన తరువాత చేసుకోవాలనుకుంటే రంభలు, అప్సరసలు ఎందుకని దెప్పిపొడిచారు. ఎప్పుడు తన కొడుక్కి ఆ కళ్యాణయోగమో కదా అని భారంగా నిట్టూర్చాడు రంగారావు.



★ ★ ★

సుందరం ఆఫీసు నుండి వచ్చిన తరువాత విషయాన్ని సూచాయగా అతనికి తెలిపాడు రంగారావు.

విషయం విన్న సుందరం ముందర చికాకు పడినా, రంగారావు నచ్చచెప్పడంతో ''మీ యిష్టం నాన్నగారు. ఇప్పటికే ఎన్నెన్నో సంబంధాలు చూసాను. గిన్నీస్ బుక్ రికార్డు ఎంతో నాకు తెలియదుకానీ, బహుశా మనం మనకి తెలియకుండానే ఆ రికార్డుని బద్దలుకొడతామేమో'' ఎంతో బాధగా అన్నాడు సుందరం.

అతని బాధని అర్థం చేసుకొన్న రంగారావు. ''నిజమేరా, అయినా జాతకం నప్పని పిల్లని ఎలా కోడలు చేసుకోమంటావురా?'' అడిగాడు

## సిమ్రాన్ సంబరం

బాలీవుడ్ ద్వారా హీరోయిన్ అయినప్పటికీ అక్కడ అంతగా ప్రోత్సాహం లభించని సిమ్రాన్‌కి తెలుగులో బ్రహ్మాండమైన క్రేజ్ వచ్చింది. ఆ తర్వాత తమిళ సినీ రంగంలో కూడా నంబర్ వన్ హీరోయిన్ అయింది. కెరీర్ మంచి ఊపులో వుండగానే పెళ్లి చేసుకుని సినిమాలకు గుడ్‌బై అనేసిన సిమ్రాన్ కొడుకు తల్లి కూడా అయింది. ఇప్పుడు తిరిగి బాలకృష్ణతో 'ఒక్క మగాడు' సినిమాలో నటించడం ద్వారా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తోంది. తనకి ఎంతో క్రేజ్ తెచ్చిపెట్టిన తెలుగు సినిమాల ద్వారా తిరిగి తన పునఃప్రవేశం జరగడం తనకి ఎంతో ఆనందంగా వుందని చెబుతున్న సిమ్రాన్- ఓ తమిళ చిత్రాన్ని కూడా అంగీకరించిందిట.

రంగారావు.

దాంతో అరికాలు మంట నెత్తికెక్కింది సుందరానికి. ''నాన్నగారు.. మీకిదే చెబుతున్నాను. ఈసారి కనక మీరు, అమ్మా జాతకం, మడీ, దడి అన్నారంటే నేనసలు ఊరుకోను. ఈ జన్మలో ఇంక పెళ్ళే చేసుకోను. నాతోనే మీ వంశం ఆగిపోతుంది'' బెదిరిస్తున్నట్లుగా అన్నాడు సుందరం.

''ఇది మరీ బావుందిరా! అందం చందం అంటూ నువ్వు ఎంతమంది పిల్లలకు లేనిపోని వంకలు పెట్టలేదు. అప్పుడు మేం ఏమైనా అన్నామా? ఐనా కళ్యాణ ఘడియ రావాలేకానీ, ఇవన్నీ ఎంతరా'' నచ్చచెప్పారు రంగారావు దంపతులు.

మొత్తానికి వాళ్ళు ఆ వచ్చే ఆదివారం శాస్త్రిగారు చెప్పిన అనకాపల్లి సంబంధాన్ని చూడడానికి వెళ్ళదల్చుకొన్నారు. అదే విషయాన్ని శాస్త్రిగారి ద్వారా ప్రకాశంగారికి కబురు పంపించారు. శుభం అంటూ శాస్త్రిగారు ఆ కబుర్ని ఆడపిల్ల వారికి చెప్పడానికి వెళ్ళారు.

★ ★ ★

## జిడ్డు సెంటిమెంట్!

**స్నానం చేసే ముందు ఒంటికి ఆయిల్ రాసుకోవడం ఓ పద్ధతి. సినిమాల్లో అయితే కొంతమంది హీరోయిన్లు ఒంటికి ఆయిల్ రాసుకుని అదో టైప్ గెటప్పులో దర్శనమిస్తుంటారు. 'దేవదాసు' సినిమాలో ఇలా కనిపించి కుర్రకారుని హుషారెక్కించిన ఇలియానా మళ్లీ ఇప్పుడు ఇలాంటి ఆయిల్ గెటప్పుతో 'ఆట' సినిమాలో కనిపించబోతోందిట. 'దేవదాసు' హిట్టయింది. అలాగే 'ఆట' కూడా బంపర్ హిట్టవుతుందేమో!**

సుందరం, రంగారావు, శారద గదిలో కుర్చీల్లో కూర్చున్నారు. కొంతసేపు కుశల ప్రశ్నలైన తరువాత, ఇంక అమ్మాయిని తీసుకురండి. ఇప్పుడేం వర్జ్యాలు లేవు. ముహూర్తం కూడా చాలా బావుంది అంటూ శాస్త్రిగారు కంగారు పెట్టేసారు.

ప్రకాశరావు భార్య వసుధ పిల్ల పర్ణికను తీసుకొని వచ్చింది.

పిల్ల చూడ్డానికి చక్కగా ఉంది. వంటా వార్పూ గురించి అడుగుదామనుకొన్న శారదకి బయలుదేరేముందు ఇంట్లో కొడుకు సుందరం ఇచ్చిన వార్నింగ్ గుర్తొచ్చి నోటిదాకా వచ్చిన మాటలను గొంతులోనే ఉంచేసుకొంది.

''బావగారూ... అమ్మాయి జాతకం...'' అని అడగబోయిన రంగారావు సుందరం కోపంగా ఆయన వంక చూడ్డంతో మాటమారుస్తూ, ''మాకు అంతగా జాతకాల పట్టింపు లేదు. అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి నచ్చితే చాలు'' అంటూ చాలా తెలివిగా మాట్లాడాడు.

అమ్మ రంగారావు, ఎంత చక్కగా నటిస్తున్నావు అనుకొంటూ ముక్కున వేలేసుకొన్నారు శాస్త్రిగారు.

''లేదండి బావగారు, అమ్మాయిది జాతకం రాయించాము. కావాలంటే ఇస్తాను'' అన్నాడు ప్రకాశరావు.

''అబ్బబ్బా! ఎందుకండీ..వద్దంటున్నారుగా'' అంటూ తెలివిగా ఆ ప్రమాదాన్ని తప్పించారు శాస్త్రిగారు.

శాస్త్రిగారికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు సుందరం.

రంగారావుకి మాత్రం శాస్త్రిగారిమీద పీకలదాకా కోపం వచ్చింది ఆయన ఇస్తానన్న జాతకాన్ని ఇవ్వకుండా ఆపినందుకు.

ఇంతలో ఫలహారాలు తీసుకొని వచ్చింది ప్రకాశరావు భార్య వసుధ.

''ఇప్పుడివన్నీ ఎందుకండి. కతికితే అతకదు అంటారు'' అంటూ ఫలహారాలని గౌరవంగా తిరస్కరించారు రంగారావు దంపతులు. మెచ్చుకోలుగా వాళ్ల వంక చూసాడు సుందరం.

''బాబూ అమ్మాయితో ఏవైనా మాట్లాడుతావా'' వినయంగా అడిగాడు ప్రకాశరావు సుందరాన్ని.

అవునన్నట్లుగా మొహమాటంగా తలూపాడు సుందరం. దాంతో అక్కడ ఉన్నవాళ్లంతా వాళ్ళిద్దర్ని ఒంటరిగా వదిలేసి ముసిముసిగా నవ్వుకొంటూ వేరే గదిలోకి వెళ్ళిపోయారు.

★ ★ ★

సుందరం ఉపోద్ఘాతంగా చిన్నగా దగ్గుతూ తన ఉనికిని తెలియజేసాడు. పర్ణిక చిరునవ్వుతో అతని వంక చూసింది. దాంతో ధైర్యం వచ్చిన సుందరం, ''చూడండి పర్ణిక గారు..నేను మీకు నచ్చానా'' అని అడిగాడు. పర్ణిక గొంతు సవరించుకొని, ''సుందరం గారు.. మీరు ఏమనుకోనంటే నా అభిప్రాయాన్ని చెప్పేముందు, నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుతాను ఏమనుకోకుండా సమాధానం చెబ్తారా!'' అమాయకంగా అడిగింది పర్ణిక.

కంఠం కోకిలలా ఉన్నా, ఆమె ఆఖరున అన్న మాటలే నచ్చలేదు సుందరానికి. అతని స్నేహితులు చేసిన ఉపదేశాలు, సలహాలు గుర్తొచ్చి లోపల కోపంగా ఉన్నా పైకిమాత్రం నవ్వుతూ ''అడగండి. ఇలా మనం మనసు విప్పి మాట్లాడుకొంటేనే మంచిది'' అంటూ లేనిపోని గాంభీర్యాన్ని ప్రదర్శించాడు సుందరం.

''అయితే సుందరంగారూ నా మొదటి ప్రశ్న... ఏం నేను అందంగా లేకపోతే నన్ను పెళ్ళి చేసుకోవడానికి మీకు ఏమైనా అభ్యంతరమా?'' సూటిగా అడిగింది పర్ణిక.

''అబ్బే అదేం లేదు..అందాన్ని మనమేమైనా కొరుక్కుతింటామా ఏమిటి! ఈ రోజున్న అందం రేపుండదుగదా'' స్నేహితుడు సుబ్బారావు డైలాగుని వాడుకొన్నాడు సుందరం.

''వెరీగుడ్..చాలా చక్కగా చెప్పారు'' మెచ్చుకోలుగా చూసింది పర్ణిక. ఈ అందం అన్నది



శాశ్వతం కాదు. అందంకన్నా మన మనసులు ముఖ్యం. బాహ్య సౌందర్యం కన్నా, అంతర్ సౌందర్యమే ముఖ్యం అన్న పర్ణిక మాటలకు గంగిరెద్దులా తలూపాడు సుందరం.

''ఇంక రెండవ ప్రశ్న...ఒకవేళ మన జాతకాలు కలవకపోతే, నన్ను పెళ్ళి చేసుకోరా?'' అడిగింది పర్ణిక.


''జాతకాలు..జాతకాలు..'' అంటూ నీళ్ళు నమిలాడు సుందరం.

''చూడండి సుందరంగారు..ఈ జాతకాలు అన్నవి మనం ఏర్పరచుకొన్నవి...ఈ ప్రపంచంలో ఏ ఒక్కరు, ఇంకొకరి భవిష్యత్తును గూర్చి కరక్టుగా చెప్పలేరు. ఈ జాతకాలన్నవి మనల్ని ఊరటపరచడానికేగాని మరి దేనికి పనికి రావు. అంతెందుకు నిన్నటివరకు గ్రహాలు తొమ్మిది అన్నవారు నేడు ఎనిమిదే అంటున్నారు. ఒకవేళ గ్రహాల సంఖ్య తగ్గితే, మన జాతకంలో ఉన్న ఆ తొమ్మిదో గ్రహం తాలూకు ఫలితాలు ఏమౌతాయి. లేక వేరే గ్రహం తాలూకు ఫలితాలనే ఆ గ్రహానికి చెబుతారా? చూడండి మనకు పెళ్ళయ్యే యోగం ఉంటే ఏ జాతకాలు మనల్ని అడ్డుకోలేవు. అంతెందుకు మన యిద్దరికీ రాసి ఉండకపోతే ఈరోజు మీరు ఇలా నన్ను చూడ్డానికి వచ్చేవారు కారేమో''

నిజమే ఆమె చెప్పింది. ఎంతోమంది జాతకాలు చూసుకొని మరీ పెళ్ళి చేసుకొన్నా కొందరి జీవితాల్లో సుఖశాంతులు ఉండవు. మరికొందరు కడకంటూ కాపురాలు చేయరు, మరికొందరు మధ్యలోనే విడిపోతున్నారు. నిజంగా జాతకాలు సరిపోతే గనక ఇలా ఎందుకు జరుగుతున్నాయి. ఏమైనా అంటే వాళ్ళ ఖర్మ అలా ఉంది, లేక వాళ్ళ తలరాత అలా వుంది కనుకనే అలా జరిగిదంటారు ఆలోచించాడు సుందరం. ''అంతెందుకు సుందరంగారు- రామాయణ, మహాభారతాలు గాని, ఇంకా ఇతర పురాణాల పురుషులను గానీ తీసుకోండి. అందరూ చాలా మటుక్కి పత్నీ వియోగులే, లేక బాధలు పడ్డవారే. మరి ఆరోజుల్లో కూడా జాతకాలు చూసే పెళ్ళిళ్ళు చేసేవారని చదివేం కదా? అలా ఎందుకు జరిగిందని ఎవరైనా ప్రశ్నించారా?

## రవితేజకి నయన కితాబు

**రవితేజ-నయనతార జంటగా 'దుబాయ్ శీను' నిర్మాణంలో వుంది. ఈ సినిమా షూటింగులో ఖాళీ సమయంలో రవితేజ వేసే జోకులు నయనతారకి తెగ నచ్చేస్తున్నాయిట. 'నిజంగా రవిగారు భలే నవ్విస్తారు. షూటింగ్‌లో టెన్షన్ కాస్త ఉఫ్‌మని ఎగిరిపోయి హాయిగా వుండేలా చేస్తుంటాయి ఆ జోకులు' అని మెచ్చుకుంటోంది నయనతార. ఎంత సుత్తి జోకునైనా నవ్వొచ్చేలా చెప్పడం ఆయన ప్రత్యేకత అని రవితేజకి కితాబునిస్తోంది నయనతార.**



అలా ప్రశ్నించిన వాళ్ళని వెర్రివాళ్ళుగా జమకడతారు తప్పించి, ఎందుకు జరిగిందో ఎవ్వరూ చెప్పరు, చెప్పలేరు. పైపెచ్చు అలా జరగాలని ఉంది జరిగింది. అలాగనక జరగకపోతే రామాయణమే లేదు అంటారు. ఇంకా ఎక్కువగా మాట్లాడితే వితండ వాదం చేయకు అంటారు. మన దగ్గర సరైన సమాధానం లేనప్పుడు అది వితండ వాదం అవుతుంది. అయినా ఎప్పుడో జరిగిన రామాయణాన్ని ఎందుకు ఉదాహరణగా తీసుకోవడం? మన సమాజంలోనే రోజుకి ఎంతోమంది పెళ్ళైన వారు విడిపోతున్నారు. కల్సుకొంటున్నారు. ఏమంటారు'' అంటూ ఆగింది పర్ణిక.

''ఒకవేళ మీకు జాతకాలు కావాలనే పట్టుపట్టారనుకోండి, మీ తృప్తికోసం దొంగ జాతకాలు మీకు అనుగుణంగా రాయించి ఇవ్వచ్చును. అలా ఈయడం వలన పెళ్ళిళ్ళు జరగవచ్చునేమోకానీ, జరిగేది జరగక మానదు కదా? మరింకెందుకండి జాతకాలు గీతకాలు అంటూ వచ్చిన సంబంధాలని కాదంటారు? ఇంక నా మూడవ ప్రశ్న. మీ అమ్మగారు పూజలు, పునస్కారాలు, మడీ ఆచారం అంటారు. మనకే గనక పెళ్ళైతే ఇద్దరం ఉద్యోగస్తులం, టైముకు ఆఫీసుకి వెళ్ళలేకపోతే పూజల వలన ఆలస్యంగా వచ్చాను, ఇవాళ మడిగట్టుకోవడం లేటు అవడం వలన ఆఫీసుకు లేటుగా వచ్చానని చెప్పగలరా?''

''నిజమే. అనలేము'' సన్నగా అన్నాడు సుందరం.

''చూడండి, మనం ఈ ఆచారాలు ఏర్పరుచుకొన్నవి శుచీ, శుభ్రం కోసం కానీ మరింకెందుకూ కాదు. మనం మడి గట్టుకోనంత మాత్రాన చేసుకొనే వంటలు మానక్కర్లేదు. మన మనసు శుచిగా ఉన్నంతకాలం, మనకు ఎటువంటి మడీ ఆచారాలు అవసరం లేదండి. మానవత్వాన్ని మించిన మడి లేదండి. వెనకటికి మీలాగే ఎవరో బామ్మగారు అనుకొన్నారట, 'దండెం మీద మడిబట్ట ఆరేసాను దొంగలు రారులే' అని. అలా ఉందండి మీ వాళ్ళ చాదస్తం. మన ఆచారవ్యవహారాలు, పద్ధతులు వేరొకరికి ఇబ్బందికరం కానంతవరకు పర్వాలేదు. అలాగే సాగుబాటు ఉంటేనే ఈ ఆచారాలు అవీను. మన అభిప్రాయాలను వేరొకరిపై బలవంతంగా రుద్దే హక్కు ఎవరికీ లేదు. చూడండి సుందరంగారు నేను ఇలా మాట్లాడి ఎవర్నీ కించపరచాలని కాదు. ఎవరి పద్ధతులు వారివి. ఎవరి అభిప్రాయాలు వారివి, కానీ వాటినే పట్టుకొని, తాపట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్లుగా వ్యవహరించకూడదు. ప్రతీ దానికి పట్టూ విడుపూ అంటూ ఉండాలి, ఏమంటారు'' అతని వంక మాట్లాడడం ఆపి చూసింది పర్ణిక.

''ఇంక చాలు పర్ణికగారు. మీ మనసేమిటో నాకర్థమయింది. నేను మీ భావాల్ని, ఆలోచనలని, అభిప్రాయాలని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. మీరు నాకు నచ్చారు. ఇంక మీరు మీ అభిప్రాయాన్ని నిక్కచ్చిగా తెలిపితే, మావాళ్ళతో చెప్పి త్వరలోనే ముహూర్తాలు పెట్టిస్తాను'' అన్నాడు సుందరం.


''సుందరంగారు! మీలో నాకు నచ్చని

దంటూ ఏమీ లేదు. అయినా మీలోని లోపాలు మీకు తెలియజెయ్యాలనే ఇలా మాట్లాడవలసి వచ్చింది. నన్ను క్షమించండి. ఇటువంటి లోపాలు మీలోనే కాదు. చాలా మందిలో ఉన్నాయి. అబ్బాయి అభిప్రాయానికే విలువనిస్తారుగాని, ఆడపిల్ల అభిప్రాయానికి ఎందుకు విలువనివ్వరు? ఆడపిల్ల తల్లితండ్రులు కూడా తమ పిల్ల అభిప్రాయాన్ని అడగరు, పట్టించుకోరు. అలా అడిగితే ఎక్కడ మగపెళ్ళివారు తప్పుగా అనుకొంటారో అని భయం. పైపెచ్చు ఆడపిల్లని గుండెలపై కుంపటిలా వర్ణిస్తారు. కానీ ఈరోజుల్లో సంస్కారం లేని కొడుకులకన్నా ఆడపిల్లలే నయం ఏమంటారు.

పెళ్ళిచూపుల పేరుతో రావడం, కొంతసేపు కూర్చోవడం దాని నిమిత్తమై అమ్మాయి తరుపువారు తెగ హైరానాపడిపోయి లేనిపోని ఖర్చులకు పోవడం, తీరా అన్నీ అయిన తరువాత మగ పెళ్ళివారు ఏ విషయం ఇంటికి వెళ్ళి తెలియజేస్తామంటారు.

కట్నాలు సరిపోకపోయినా, పిల్ల అందంగా లేకపోయినా జాతకాలు నప్పలేదంటూ మధ్యవర్తి ద్వారా కబురు పంపించి చేతులు దులిపేసుకొంటారు. దానివల్ల ఆడపిల్ల ఎంత బాధపడుతుందో ఎవరైనా, ఏనాడైనా ఆలోచించారా? జాతకం బావులేకపోవడం అన్నది ఆ అమ్మాయి తప్పా? లేక అందంగా పుట్టకపోవడం ఆ అమ్మాయి చేసిన తప్పా? చెప్పండి. ఇది నా ఒక్కర్తి సమస్యా కాదు సుందరంగారు.. పెళ్ళి కావాల్సిన ప్రతీ ఆడపిల్ల ఆక్రందన. ఈ సమాజంలో మగవాడికే అన్ని హక్కులూనూ. ఎంతసేపు ఆడపిల్ల జాతకం గురించే మాట్లాడుతారుగాని, మగపిల్లవాని జాతకం గురించి మాట్లాడరు. అలాగే తనింటి పిల్లను చూసిన మగపెళ్ళివాళ్ళు, అదే జాతకాలు నప్పలేదని అంటే.. 'ఆ... జాతకాలు నప్పక కాదు. మనం ఇస్తామన్న కట్నం చాలక అంటారు' కానీ అదే విషయాన్ని మన అబ్బాయికి చూసి తిరస్కరించిన అమ్మాయి విషయంలో ఎందుకు ఆలోచించరు?'' బాధగా అంది పర్ణిక.

''అమ్మాయి గురించి తెలుసుకోవాలంటే ఎంతోసేపు పట్టదు. అలాగే అబ్బాయి గురించి కూడా. అన్నం ఉడికిందో లేదో తెలుసుకోవడానికి అన్నమంతా పట్టుకోనవసరం లేదు. ఒక్క మెతుకు ముట్టుకుంటే చాలు. అలాగే ఎవరితోనైనా కొంచెం సేపు మాట్లాడితే చాలు. వాళ్ళు ఎటువంటి వాళ్ళో చక్కగా తెలుసుకోవచ్చును. ఈనాడు మనం వేసుకొనే బట్టల్ని బట్టి, మనం నడిచే విధానాన్ని బట్టి, అంతెందుకు మనం కూర్చునే పద్ధతిని బట్టి మన మనస్తత్వాన్ని చెప్పగలరు. దీన్నే బాడీ లాంగ్వేజ్ అంటారు. అందుచేత ఇటువంటి అర్థంలేని వంకలతో వచ్చే ముందుతరం వాళ్ళైనా కళ్ళు తెరుచుకొని, పెళ్ళిచూపులు, జాతకాల పేరుతో అమ్మాయిల మనసులతో ఆడుకోరని ఆశిద్దాం!''




''నిజమే అనాదిగా పురుషాధిక్యతే చెల్లింది. ఆడపిల్ల అభిప్రాయాలకు ఎవరు విలువ నివ్వలేదు'' అన్నాడు సుందరం.

''అంతేకాదు మీకు ఇంకో ముఖ్యమైన విషయం చెప్పాలి'' అంటూ అతని వంక చూసింది పర్ణిక.

''చెప్పండి పర్ణికగారు, మీరు మాట్లాడుతూ వుంటే చాలా బావుంది'' అన్నాడు సుందరం.

''ఏం లేదు సుందరంగారు... మీరు నన్ను ఇంతకుముందు ఎప్పుడైనా చూసారా?'' అడిగింది పర్ణిక.

''నేనా.. మిమ్మల్నా.. ఎక్కడైనా చూసేనా?'' బుర్రగోక్కున్నాడు సుందరం.

''ఊహూ.. చూసిన గుర్తు రావడం లేదు'' నిజాయితీగా అన్నాడు.

''లేదు చూసారు... బాగా గుర్తుచేసుకోండి'' అంది పర్ణిక.

''లేదు పర్ణికగారు.. గుర్తుకు రావడం లేదు.. మీరే చెప్పండి'' అన్నాడు సుందరం.

''మీరు నన్ను ఐదేళ్ళ క్రితం, వైజాగ్ ఎమ్.వి.పి.కాలనీలో మా యింట్లోనే చూసారు. బహుశా అదే మీకు మొదటి పెళ్ళిచూపులు అనుకొంటా!''

నిజమే అప్పుడు గుర్తొచ్చింది సుందరానికి. ''ఆ... అవును ఇప్పుడు గుర్తొచ్చింది'' అన్నాడు సుందరం.

''మరి మీరు.. ఇంకా ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?'' అడిగాడు సుందరం.

''నేను చేసుకోక కాదు సుందరంగారు.. మీలాంటి వాళ్ళకి నేను నచ్చక'' బాధగా అంది పర్ణిక.

''సారీ... పర్ణికగారు.. లేనిపోని వంకలతో, నాకు నిజంగా కావల్సింది ఏమిటో తెలుసుకోలేక, సరైన సమయానికి సరైన నిర్ణయాన్ని తీసుకోలేక మీలాంటివాళ్ళ మనసుల్ని బాధపెట్టాను. కానీ ఈరోజు అసలు పిల్ల దొరికితే చాలు పెళ్ళి చేసుకోవాలన్న స్టేజికి వచ్చాను'' బాధగా అన్నాడు సుందరం.

''మీరే కాదండి. మీలాగే ఆలోచించి పిల్లని తిరస్కరించిన ప్రబుద్ధులు ఈ సమాజంలో చాలామందే ఉన్నారు. ఇప్పటికైనా మీరు మీ తప్పుని తెలుసుకున్నారు అంతేచాలు.''

''నిజమే..'' సిగ్గుగా తల వంచుకొన్నాడు సుందరం.

''అలా వంచుకోవడం కాదండి, మనం ఏదైనా మంచిపని చేసి నలుగురికి ఆదర్శం కావాలి'' చెప్పింది పర్ణిక.

''పోనీలెండి ఇప్పటికైనా ఆ భగవంతుడికి నాపై దయ కలిగింది. అలాగే మనిద్దరికి ఇలా రాసి పెట్టి ఉంది కనుకనే, ఇంతవరకు ఇద్దరం అవివాహితులుగా ఉండిపోయాము. ఇంక ఆలస్యం చేయడం మంచిదికాదు'' అంటూ ఆమెకేసి ఆమె నిర్ణయం కోసం ఆతృతగా చూసాడు.

సుందరం నిర్ణయాన్ని, అభిప్రాయాన్ని తెలుసుకొన్న పర్ణిక కూడా అతని అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లుగా నేలమీద బొటనవ్రేలుతో రాస్తూ సిగ్గుగా తలొంచుకుంది. ఆమె సిగ్గు, మౌనాన్ని చూసిన సుందరం, మౌనమే అంగీకారంగా భావించి ఆమెవైపు చిరునవ్వుతో చూసాడు. పర్ణిక కూడా అతని నవ్వుతో శృతి కలిపింది.

ఇద్దరూ నవ్వుకుంటూ బైటికి రావడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకొన్నారు ప్రకాశరావు దంపతులు.

విషయం సుందరం ద్వారా తెలుసుకొన్న రంగారావు దంపతులు అప్పటికప్పుడు శాస్త్రిగారిచే ముహూర్తం పెట్టించి, నిశ్చయతాంబూలాలు కూడా పుచ్చుకొని తమ ఊరివైపు బయలుదేరారు. అలా వెళుతున్న సుందరం వాళ్ళ కారు కనిపించేంతవరకు ఆనందంగా చేయి ఊపుతూనే ఉంది పర్ణిక.

☆